క్లుప్తంగా

1న పీడీఎస్‌యూ పూర్వవిద్యార్థుల సమ్మేళనం



కావలి: కందుకూరులో డిసెంబర్ 1న పీడీఎస్‌యూ పూర్వవిద్యార్థుల మహా సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం సునీల్ తెలిపారు. అందుకు సంబంధించిన వాల్‌పోస్టర్లను కావలిలో గురువారం ఆవిష్కరించారు. పీడీఎస్‌యూ ఆవిర్భవించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న పూర్వ విద్యార్థుల మహాసమ్మేళనానికి ప్రతిఒక్కరూ హాజరై జయప్రదం చేయాలని కోరారు. పట్టణ నాయకులు ప్రసాద్, నరేష్, చందు, భాస్కర్, మల్లికార్జున్, నారాయణ పాల్గొన్నారు.

మంచి ఆహారపు అలవాట్లతో ఆరోగ్యం పదిలం



కలిగిరి: మంచి ఆహారపు అలవాట్లతో ఆరోగ్యాన్ని పదిలంగా ఉంచుకోవచ్చునని ఆయుర్వేద వైద్యాధికారిణి టీ రోహిణి తెలిపారు. సిద్ధనకొండూరులో ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో ఆరోగ్యంపై అవగాహన ర్యాలీని గురువారం నిర్వహించారు. వైద్యసిబ్బంది కృష్ణ, సుబ్బారెడ్డి, శ్రీకాంత్, లలితకుమారి, తదితరులు పాల్గొన్నారు.

మెనూను పాటించాలి



దుత్తలూరు: వసతిగృహ విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని సాంఘిక సంక్షేమ శాఖ ఇన్‌చార్జి డీడీ శ్రీనివాసులు సూచించారు. నర్రవాడ ఎస్సీ బాలుర వసతిగృహాన్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులకు వడ్డించిన భోజనాన్ని రుచిచూసి నాణ్యతను పరిశీలించారు. అనంతరం రికార్డులు తనిఖీ చేశారు. వార్డెన్ రామ్మూర్తికి సూచనలు చేశారు.

వెంగమాంబకు పల్లకిసేవ




దుత్తలూరు: నర్రవాడలో కొలువైన వెంగమాంబ పేరంటాలుకు పల్లకిసేవను గురువారం వైభవంగా నిర్వహించారు. ఉదయం విశేషాభిషేకాలు, చందనాలంకరణ, కుంకుమార్చన నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

విత్తనశుద్ధిపై అవగాహన



అల్లూరు: నారు పోసుకునే ముందు విత్తన శుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలని ఏఓ వెంకటేశ్వర్లు రైతులకు సూచించారు. మండలంలోని నార్త్‌మోపూర్‌లో విత్తనశుద్ధిపై రైతులకు గురువారం ఆయన అవగాహన కల్పించారు. సుడోమోనాస్‌తో విత్తన శుద్ధి చేసుకుంటే నెల రోజుల పాటు తెగుళ్లు దరిచేరవని తెలిపారు. రసాయన ఎరువులకు బదులుగా సేంద్రియ ఎరువులను వినియోగించాలని సూచించారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి చొరవచూపాలి



సోమశిల: ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ప్రజాసమస్యల పరిష్కారానికి చొరవచూపాలని ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ అన్నారు. అనంతసాగరం మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. తొలుత ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ సర్వసభ్య సమావేశం అజెండాను చదివి వినిపించారు. అనంతరం శాఖల వారీగా అధికారులు ప్రగతిని, ప్రభుత్వ లక్ష్యాలను వెల్లడించారు. అనంతరం ఎంపీపీ, ఎంపీడీఓలు మా ట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం మెరుగునకు చర్యలు చేపట్టాలని సూచించారు.

ఎంఎస్‌ఎంఈల సర్వేపై శిక్షణ

వింజమూరు(ఉదయగిరి): సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల సర్వేపై సచివాలయ సిబ్బందికి వింజమూరు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఎంఎస్‌ఎంఈలపై శుక్రవారం నుంచి సర్వే చేపట్టాలని సూచించారు. అందుకు సంబంధించిన వివరాలను ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో నమోదు చేయాలని తెలిపారు. సర్వే ఆధారంగా ప్రభుత్వం ప్రోత్సాహకాలను అందజేయనున్నట్లు వివరించారు.

చామరైతు కుదేలు

తీరంలో 2500 ఎకరాల్లో సాగు

- వర్షాలకు ఆశించిన ఆకుమచ్చ తెగులు
- మందులు వాడినా కనిపించని ఫలితం
- క్రమంగా ఎండిపోతున్న పంట
- ఆందోళనలో అన్నదాతలు



ఆకుమచ్చ తెగులు సోకిన చామగడ్డ పైరు

కావలి: మండలంలోని తీరప్రాంత గ్రామాల్లోని ఇసుక నేలల్లో చామ పంటను విస్తారంగా సాగుచేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు చామ పంటను రూపాయి బిళ్ల(ఆకుమచ్చ) తెగులు సోకింది. ఎన్ని మందులు వాడినా తెగులు అదుపులోకి రాక క్రమంగా పంట ఎండిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కావలి మండలంలోని తీరప్రాంత గ్రామాల రైతులు చేమ పంటను విస్తారంగా సాగుచేస్తున్నారు. చామకు తేమ శాతం ఎక్కువగా ఉండే నేలలు అనుకూలం. తీరంలోని ఇసుక నేలల్లో స్ప్రింకర్ల ద్వారా 2,500 ఎకరాల్లో పంటను సాగు చేస్తున్నారు. ప్రస్తుతం రెండు, మూడు, నాలుగు నెలల దశలో పంట ఉంది. ఇటీవల కురిసిన వర్షాలు చామ పంటపై తీవ్ర ప్రభావం చూపాయి. భూమిలో వర్షపు నీరు నిలిచి తేమ శాతం ఎక్కువవడంతో తెగుళ్లు ఆశించాయి. ప్రధానంగా రూపాయి బిళ్ల (ఆకుమచ్చ) తెగులు సోకింది. తెగులు ప్రభావంతో ఆకులపై రూపాయి బిళ్ల అంత మచ్చలు ఏర్పడి క్రమంగా పంట ఎండిపోతోంది. ఎన్ని మందులు వాడినా ఫలితం లేదని రైతులు వాపోతున్నారు. చామ దుంపలు భూమిలో ఊరుతాయి. భూమి పైన ఉండే ఆకులు పచ్చగా ఉంటేనే గడ్డలు బాగా ఊరి అధిక దిగుబడులు వస్తాయి. చామ ఆరు నెలల పంట. ఎకరా సాగుకు రూ.70వేల వరకు పెట్టుబడులు అవుతాయి. పంట బాగా వస్తే ఎకరాకు 10 నుంచి 15 టన్నుల వరకు దిగుబడులు వస్తాయి. ప్రస్తుతం టన్ను చామగడ్డల ధర రూ.35వేల వరకు ఉంది. ఆకుమచ్చ తెగులు ప్రభావంతో పంట ఎండిపోతుండడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. కనీసం పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదని దిగాలు చెందుతున్నారు.



ఆకులపై ఏర్పడిన ఆకు మచ్చలు

పంట ఎండిపోతోంది



ఇటీవల కురిసిన వర్షాలకు చామ పంటను రూపాయి బిళ్ల(ఆకుమచ్చ) తెగులు సోకింది. ఎన్ని మందులు వాడుతున్నా ఫలితం లేదు. క్రమంగా పంట మొత్తం తెగులు వ్యాపిస్తోంది. దీని ప్రభావంతో పంట ఎండిపోతోంది. ఈ దఫా పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదు.

–కృష్ణమ్మ, మహిళా రైతు, అన్నగారిపాళెం

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

చామ పంటపై ఆకుమచ్చ తెగులు తీవ్ర ప్రభావం చూపుతుంది. ముందస్తుగా సస్యరక్షణ చర్యలు చేపట్టకపోతే పంట ఎండిపోయి నష్టపోయే ప్రమాదం ఉంది. తెగులు నివారణకు లీటర్ నీటికి మాంకోజెబ్ 2.5 గ్రాములు లేదా కార్బన్‌డిజం, మాంకోజెబ్ కలిసి ఉన్న మందు లేదా మెటలాకిల్స్ ఎంజెడ్ 2 గ్రాములను లీటర్ నీటికి కలిపి పది రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి.

–ఎం.సుధామయి, ఉద్యానశాఖ అధికారిణి, కావలి

అణగారిన వర్గాల ఆశాజ్యోతి పూలే



కావలిలో జ్యోతిరావు పూలేకు నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



కలిగిరిలో నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



కావలి: నివాళులర్పిస్తున్న జిల్లా విద్యుత్‌శాఖ ఎస్‌ఈ విజయన్

కావలి: అణగారిన వర్గాల ఆశాజ్యోతి మహాత్మ జ్యోతిరావు పూలే అని వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ఆదేశాల మేరకు మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతిని పురస్కరించుకుని పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి వైఎస్సార్‌సీపీ నాయకులు గురువారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశం గర్వించదగ్గ సంఘ సంస్కర్తల్లో పూలే ముందు వరుసలో ఉంటారన్నారు. అణగారిన వర్గాల, స్త్రీల అభ్యున్నతి కోసం ఎంతో కృషి చేసిన మహానుభావుడని కొనియాడారు.

విద్యుత్ ఆఫీస్‌లో..

పట్టణంలోని డివిజనల్ విద్యుత్ కార్యాలయంలో జ్యోతిరావు పూలే చిత్రపటానికి జిల్లా విద్యుత్ శాఖ ఎస్‌ఈ విజయన్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూలే దంపతుల సంఘ సేవలను కొనియాడారు. కావలి ఈఈ కేఎస్ బెనర్జీ, డీఈఈ రవికుమార్ రెడ్డి , ఏఈలు వై వసంతరావు, శ్రీనివాసరెడ్డి, వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.

కలిగిరి: స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ఆవరణలో జ్యోతిరావు పూలే చిత్రపటానికి జెడ్పీటీసీ పాలూరు మాల్యాద్రిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక నాయకులు మూలి రాధాకృష్ణారెడ్డి, కూనిపోగు ఇర్మియా, శ్రీనివాసులు, ఖాజామైనుద్దీన్, ప్రసన్న, సుబ్బనాచారి, తదితరులు పాల్గొన్నారు.

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండల పరిషత్ కార్యాలయంలో మహాత్మ జ్యోతిరావు పూలే చిత్రపటానికి ఎంపీడీఓ ఏ శ్రీనివాసరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ పూలే సమాజంలోని సామాజిక అసమానతలను రూపుమాపేందుకు తీవ్రంగా కృషిచేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు రాయితీపై సూక్ష్మసేద్యం పరికరాలు



సూక్ష్మసేద్యం పరికరాలను పరిశీలిస్తున్న పీడీ బీ శ్రీనివాసులు

దుత్తలూరు: రైతులకు రాయితీపై సూక్ష్మ సేద్యం పరికరాలను అందజేస్తున్నట్లు ఏపీఎంఐపీ పీడీ బీ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని సోమలరేగడలో రైతులు ఏర్పాటు చేసుకున్న సూక్ష్మసేద్యం పరికరాలను గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం దుత్తలూరులోని సొసైటీ కార్యాలయంలో వీఏఏలు, వీహెచ్‌ఏలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జిల్లాలో 9,200 హెక్టార్లకు మైక్రో ఇరిగేషన్ పరికరాలను అందజేయాలని లక్ష్యమని తెలిపారు. ఇప్పటి వరకు 9,824 హెక్టార్లకు సంబంధించి రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. అందులో 2,965 మంది రైతులకు సంబంధించి 3,619 హెక్టార్లను క్షేత్ర స్థాయి పరిశీలన చేశామన్నారు. 1,723 హెక్టార్లకు సంబంధించి 1,453 మంది రైతులు తమ వాటా నగదు చెల్లించడంతో కంపెనీలకు ప్రతిపాదనలు పంపించామన్నారు. 1,637 హెక్టార్లకు సంబంధించిన 1374 మంది రైతులకు పరిపాలనా అనుమతులు మంజూరు చేశామన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 805 హెక్టార్లకు పరికరాలు అందజేశామన్నారు. ఈ సమావేశంలో ఉద్యానశాఖ అధికారిణి జయశ్రీ, ఎంఐడీసీ నరేష్‌జైన్, కంపెనీ ప్రతినిధులు వెంకటాద్రి, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి



మాట్లాడుతున్న డీఈఈ చంద్రమౌళి

ఉదయగిరి: వచ్చే నెల 8న జరిగే సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఇరిగేషన్ డీఈఈ చంద్రమౌళి తెలిపారు. ఉదయగిరిలోని ఇరిగేషన్ సబ్‌డివిజన్ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉదయగిరి సబ్‌డివిజన్ పరిధిలోని సీతారామపురం మండలంలోని 6 , ఉదయగిరి మండలంలోని 11 చెరువులు, గండిపాళెం జలాశయం పరిధిలోని 17 డిస్ట్రిబ్యూటరీలకు సంబంధించి ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఓటర్ల జాబితాలను సిద్ధం చేశామని చెప్పారు. ఎన్నికల నిర్వహణకు భవనాలను గుర్తించామన్నారు. వచ్చే నెల 5న నోటిఫికేషన్ విడుదల చేస్తామని తెలిపారు. ఆయకట్టు పరిధిలో తమ పేరు ఉండి, ఓటర్ల జాబితాలో పేరు లేనివారు ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు ప్రభుత్వానికి నీటితీరువా బకాయిలు చెల్లించి నోడ్యూస్ సర్టిఫికెట్ పొందాలన్నారు. ఏకగ్రీవ నీటి సంఘాలకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందజేస్తుందన్నారు. ఎన్నికలను చేతులు ఎత్తే పద్ధతి లేదా చీటిల పద్ధతిలో నిర్వహిస్తామన్నారు. ఎన్నికలు సజావుగా, ప్రశాంతంగా జరిగేందుకు రైతులు సహకరించాలని కోరారు.

ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి

వింజమూరు(ఉదయగిరి): కౌమార బాలికలు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ బ్రిజిత సూచించారు. వింజమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో కౌమార బాలికలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కౌమార బాలికలు రక్తహీనతను అధిగమించేందుకు పోషకాహారం తీసుకోవాలని సూచించారు. చాకలికొండ పీహెచ్‌సీ వైద్యాధికారులు మురళీధర్, మస్తాన్, ఆరోగ్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

ఉదయగిరి: గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉదయగిరి ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ రామకృష్ణారావు అన్నారు. గురువారం ఆయన తన కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం మరుగుదొడ్ల నిర్మాణానికి సహకారం అందజేస్తోందని, ప్రజలకు అవగాహన కల్పించి సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. పేదలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌లను ప్రభుత్వమే నిర్మిస్తుందన్నారు.

7న తల్లిదండ్రుల సమావేశం

వరికుంటపాడు: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో డిసెంబర్ 7న తల్లిదండ్రులతో సమావేశాలను నిర్వహించాలని ఇన్‌చార్జి ఎంఈఓ-1 షేక్ మస్తాన్‌వలి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఎంసీ చైర్మన్ల ఆధ్వర్యంలో హెచ్‌ఎంలు సమావేశాలు నిర్వహించి విద్యార్థుల ప్రగతిని తల్లిదండ్రులకు వివరించాలన్నారు. తల్లిదండ్రులకు క్రీడాపోటీలు నిర్వహించాలన్నారు. ఉన్నత స్థాయిలో ఉన్న పూర్వ విద్యార్థులను సన్మానించాలని సూచించారు.

33 మద్యం సీసాల స్వాధీనం

కావలి: మండలంలోని చెన్నాయపాళెంలో మద్యం అక్రమంగా విక్రయిస్తున్నారనే సమాచారంతో గురువారం దాడులు జరిపినట్లు కావలి ఎక్సైజ్ సీఐ సుంకర శ్రీనివాసులు తెలిపారు. ఈ దాడుల్లో అరగల కృష్ణబాబు వద్ద 15, అరగల కృష్ణయ్య వద్ద 18 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఇద్దరిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సీతారామపురం: విద్యుత్‌లైన్ల మరమ్మతుల దృష్ట్యా మండలంలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ శ్రీహరి గురువారం తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎంఈఓ తనిఖీలు

వరికుంటపాడు: మండలంలోని నార్త్ కొండాయపాళెం, టీసీపల్లె పాఠశాలలను ఎంఈఓ-1 షేక్ మస్తాన్‌వలి గురువారం తనిఖీ చేశారు. విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలు, ప్రగతిని పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం మధ్యాహ్న భోజనం నాణ్యతను రుచి చూశారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

అల్లూరు: ఇస్కపల్లికి చెందిన పానికల రమేష్(43), సింగపేటకు చెందిన సాతాని పోలయ్య(68), అల్లూరులోని ఆర్డీఆర్ కాలనీకి చెందిన మైదుకూరు పార్వతి(73) గురువారం మరణించారు. వారి అంత్యక్రియలకు కేఎస్సార్ ఫౌండేషన్ చైర్మన్ కందల రాజారెడ్డి ఆదేశాల మేరకు సభ్యులు కమల్‌సింగ్, జోసఫ్ రూ.3 వేలు చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. ఉచిత అంతిమ యాత్ర వాహనాన్ని ఏర్పాటు చేశారు.

ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే చర్యలు

ఉదయగిరి: ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ సుభద్ర హెచ్చరించారు. సర్వరాబాద్‌లోని సర్వే నంబరు 740లోని 10.54 ఎకరాల ప్రభుత్వ భూమిని కొందరు ఆక్రమించి సాగుకు యత్నిస్తున్నారని గ్రామస్తులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ప్రభుత్వ భూమిలో వీఆర్వో మాలకొండయ్య గురువారం హెచ్చరిక బోర్డు ఏర్పాటుచేశారు.

రేపు పింఛన్ నగదు పంపిణీ

వరికుంటపాడు: మండలంలోని ఎన్టీఆర్ భరోసా పింఛన్ లబ్ధిదారులకు శనివారం నగదు పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ వేణుగోపాల్‌రావు గురువారం తెలిపారు. డిసెంబర్ 1వతేదీ ఆదివారం రావడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఒక్కరోజు ముందుగానే నగదు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. అందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు.

మైనింగ్‌కు అనుమతులు ఇవ్వొద్దని ఆందోళన



ఆందోళన చేపడుతున్న గ్రామస్తులు

వరికుంటపాడు: తమ గ్రామ సమీపంలోని తిప్ప ప్రాంతంలో మైనింగ్ చేపట్టేందుకు అనుమతులు ఇవ్వొద్దని మండలంలోని జంగంరెడ్డిపల్లె గ్రామస్తులు కోరారు. గురువారం వారు తిప్పకు వెళ్లే మార్గం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మైనింగ్ అధికారులు వస్తారని తెలియడంతో తమ సమస్యను విన్నవించేందుకు వచ్చామన్నారు. తిప్ప ప్రాంతాన్ని తాము ఎన్నో ఏళ్లుగా పశువుల, జీవాలకు మేత అవసరాలకు వినియోగించుకుంటున్నామని తెలిపారు. మైనింగ్‌కు అనుమతులు ఇస్తే తాము ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. మైనింగ్ కోసం బ్లాస్టింగ్ చేపడితే సమీపంలోని బడి, గుడితో పాటు గ్రామానికి కూడా ముప్పు ఉంటుందన్నారు. ఇటీవల తాము మైనింగ్ తవ్వకాలకు అనుమతులు ఇవ్వకుండా చూడాలని తహసీల్దార్‌కు సైతం వినతి పత్రం సైతం అందజేశామని తెలిపారు.

విద్యుత్ ప్రమాదాల నివారణపై అవగాహన



చేజర్ల: మండలంలోని పాడేరులో విద్యుత్ ప్రమాదాల నివారణపై అవగాహన సదస్సును గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్‌శాఖ విజిలెన్స్ ఎస్సై పీవీ సుబ్బారావు మాట్లాడుతూ విద్యుత్ ప్రమాదాలపై అవగాహన కల్పించారు. అవగాహన లేకుండా విద్యుత్ ఉపకరణాలకు మరమ్మతులు చేపట్టడం వంటివి చేయకూడదన్నారు. తడి చేతులు, చెప్పులు లేకుండా విద్యుత్ పనులు చేపట్టరాదని సూచించారు. పొలాల్లో తెగి పడిన విద్యుత్ వైర్లను తాకరాదన్నారు. ఇటీవల గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అవగాహన లేకుండా మోటార్‌కు మరమ్మతులు చేపడుతూ విద్యుదాఘాతానికి గురై మరణించాడని తెలిపారు. ఏఈ లిఖిత్‌రెడ్డి మాట్లాడుతూ గత కొంత కాలంగా కొందరు ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి రాగితీగ చోరీకి పాల్పడుతున్నారన్నారు. అటువంటి వ్యక్తులను గమనిస్తే విద్యుత్ శాఖ లేదా పోలీసు అధికారులకు తెలియజేయాలని కోరారు. చోరీల నియంత్రణకు నిఘా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఏపీ ట్రాన్స్‌కో విజిలెన్స్ ఎస్సై పుల్లారెడ్డి పాల్గొన్నారు.

అదృశ్యమైన బాలిక అప్పగింత



బాలికను బంధువులకు అప్పగించిన పోలీసులు

ఆత్మకూరు: పట్టణంలోని టెక్కె ప్రాంతానికి చెందిన షేక్ షమీమ్ అనే విద్యార్థిని బుధవారం మధ్యాహ్నం పాఠశాల నుంచి అదృశ్యమైన విషయం తెలిసిందే. బాలిక మేనమామ ఫిర్యాదు మేరకు సీఐ జీ గంగాధర్, ఎస్సై షేక్ జిలానీ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి బాలికక కోసం ముమ్మర గాలింపు చేపట్టారు. గురువారం ఉదయం ఉదయగిరిలో బాలిక ఉన్నట్లు తెలుసుకుని ఎస్సై జిలానీ హుటాహుటిన అక్కడకు వెళ్లి ఆత్మకూరుకు తీసుకొచ్చారు. అనంతరం డీఎస్పీ కే వేణుగోపాల్ సమక్షంలో బాలికకు కౌన్సిలింగ్ ఇచ్చి బంధువులకు అప్పగించారు. సెయింట్‌మేరీస్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న షమీమ్‌ను సహచర విద్యార్థిని విషయంలో నెలకొన్న అభిప్రాయ భేదాలపై హెచ్‌ఎం మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన షమీమ్ పాఠశాల నుంచి వెళ్లిపోయినట్లు డీఎస్పీ తెలిపారు. సీఐ ఆధ్వర్యంలో ఎస్సై ప్రత్యేక బృందాలతో ముమ్మర గాలింపు చేపట్టి విద్యార్థినిని గుర్తించి తీసుకొచ్చి బంధువులకు అప్పగించినట్లు ఆయన వివరించారు.

వీఆర్వో లేక ఇబ్బందులు

అనుమసముద్రంపేట: మండలంలోని చౌటభీమవరం గ్రామానికి వీఆర్వో లేకపోవడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. చౌటభీమవరం రెవెన్యూ గ్రామ పరిధిలో తిమ్మానాయుడుపల్లి, హేమనగర్, చౌటభీమవరం గ్రామాలు ఉన్నాయి. ఇటీవల సాధారణ బదిలీల్లో భాగంగా గ్రామ వీఆర్వో బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో మరొకరు రాలేదు. కనీసం ఇన్‌చార్జిని కూడా నియమించలేదు. అపట్నుంచి రెవెన్యూ సంబంధిత సేవలు అందించే దిక్కులేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల మంత్రి ఆనం రామనారాయణరెడ్డి దృష్టికి వీఆర్వో సమస్యను గ్రామస్తులు తీసుకెళ్లగా వెంటనే నియమించాలని మండలాధికారులను ఆదేశించారు. అయినప్పటికీ వీఆర్వోను నియమించకుండా మంత్రి ఆదేశాలను సైతం అధికారులు బేఖాతరు చేయడంపై స్థానికుల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల ప్రభుత్వం గోకులాలను మంజూరు చేసినా వీఆర్వో లేక తమ గ్రామానికి సమాచారం అందలేదని స్థానిక టీడీపీ నాయకులే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీఆర్వోను నియమించాలని ఎన్నిసార్లు అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి వెంటనే వీఆర్వోను నియమించాలని కోరుతున్నారు.

హైవే బాధిత రైతులకు న్యాయం చేస్తాం



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

వింజమూరు(ఉదయగిరి): జాతీయ రహదారి 167–బీజీ విస్తరణలో భూములు కోల్పోయే రైతులకు తగిన నష్టపరిహారం అందించి న్యాయం చేస్తామని కావలి ఆర్డీఓ వంశీకృష్ణ పేర్కొన్నారు. వింజమూరు మండల తహసీల్దార్ కార్యాలయంలో గురువారం రాత్రి ఆయన బాధిత రైతులతో సమావేశం నిర్వహించారు. తొలుత రైతులు మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న మార్కెట్ విలువ ప్రకారం నష్టపరిహారం అందజేయాలని ఆర్డీఓను అభ్యర్థించారు. ప్రభుత్వం నిర్దేశించిన విలువను తాము పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. మార్కెట్ విలువ ప్రకారం నష్టపరిహారం ఇవ్వలేకపోతే రెండో వైపు చెరువు లోపలకు అలైన్‌మెంట్ మార్చుకోవాలని కోరారు. అందుకు ఆర్డీఓ స్పందిస్తూ రోడ్డు విస్తరణకు 62 మంది రైతులకు సంబంధించి 2.60 ఎకరాలను సేకరిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం నిర్ణయించిన మార్కెట్ విలువ ప్రకారం రైతులకు నష్టపరిహారం ఇవ్వడం జరుగుతుందన్నారు. అందుకు సమ్మతం లేనిచో ప్రస్తుతం ఇస్తున్న నగదు తీసుకుని కలెక్టరుకు అప్పీలు చేసుకోవాలని సూచించారు. ప్రజాప్రయోజనాల దృష్ట్యా జరుగుతున్న అభివృద్ధి పనులకు భూములు ఇచ్చేందుకు రైతులు సహకరించాలని కోరారు. ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం నష్టపరిహారం అందేలా తమవంతు కృషిచేస్తామని తెలిపారు. అంతకుముందు రైతులు పాత మార్కెట్ విలువ ప్రకారం ఇస్తున్న నష్టపరిహారాన్ని నిరసిస్తూ ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సమావేశంలో తహసీల్దార్ హమీద్, రైతు ప్రతినిధులు పులిచర్ల నారాయణరెడ్డి, నారపరెడ్డి, డేగా మధు, రాజగోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆర్టీసీ బస్టాండు సమీపంలో నూతనంగా నిర్మించిన సినిమా థియేటర్‌ను అనుమతుల మంజూరు విషయమై ఆర్డీఓ పరిశీలించారు.

ఎనిమిది లేన్లుగా ట్రంకురోడ్డు విస్తరణ



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి

కావలి: పట్టణంలోని బృందావనం కాలనీ నుంచి ముసునూరు జాతీయ రహదారి వరకు ఎనిమిది లేన్లుగా ట్రంకురోడ్డును విస్తరించనున్నట్లు కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి వెల్లడించారు. గురువారం ఆయన తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పట్టణంలోని మందాటి చెరువును ట్యాంక్‌బండ్‌గా అభివృద్ధి చేస్తామని తెలిపారు. రూ.69లక్షలతో చెరువు కట్టపై కిలోమీటర్ దూరం 30 అడుగుల వెడల్పుతో వాకింగ్ ట్రాక్‌ను నిర్మించనున్నట్లు చెప్పారు. చెరువుకు తూర్పువైపున ఈట్ స్ట్రీట్‌ను ఏర్పాటు చేసి అర్ధరాత్రి 12 గంటల వరకు ప్రజలకు అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఉదయగిరి రోడ్డులోని క్రీడాశాఖ స్థలంలో స్టేడియం నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలోని గ్రామాల్లో సిమెంట్‌రోడ్ల నిర్మాణానికి తొలి విడతగా రూ.6.5 కోట్లు మంజూరు కాగా, రెండో విడతగా మరో రూ.7 కోట్లను సీఎం చంద్రబాబు విడుదల చేశారని తెలిపారు. అనంతరం 15 మంది అనారోగ్య బాధి తులకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన రూ.26.89లక్షల నగదు చెక్కులను అందజేశారు. టీడీపీ నాయకులు గుత్తికొండ కిషోర్, కల్లగుంట మధుబాబునాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఇరువర్గాల ఘర్షణ-ఆరుగురికి గాయాలు





చికిత్స పొందుతున్న శ్రీనివాసులు, మహేంద్ర

సోమశిల: పొలం వివాదాన్ని రాజీ చేసుకునే క్రమంలో ఇరువర్గాల మధ్యన నెలకొన్న ఘర్షణలో ఆరుగురు గాయాలపాలయ్యారు. ఈ ఘటన అనంతసాగరం మండలం మేకవారిపల్లిలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు..మేకవారిపల్లికి చెందిన ఇరువర్గాల నడుమ ఓ పొలం విషయంలో రెండేళ్లుగా వివాదం కొనసాగుతోంది. గురువారం పొలం వివాదాన్ని రాజీ చేసుకుందామని ఇరువర్గాల వారు పొలం వద్దకు చేరుకున్నారు. అక్కడ మాటమాట పెరిగి ఇరువర్గాల వారు ఘర్షణలకు దిగారు. ఈ క్రమంలో ఆరుగురు గాయాలపాలయ్యాయి. అందులో ఉదయగిరి శ్రీనివాసులు, జడపల్లి మహేంద్రకు తలకు తీవ్రగాయాలవగా ఆత్మకూరులోని జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కాగా ఈ విషయమై పోలీసులను సంప్రదించగా తమ దృష్టికి రాలేదని తెలిపారు.